రైల్వే ఫ్లాట్‌ఫారం రష్‌గా ఉంది. కంపార్టుమెంట్స్‌లోకి జనం ఎగబ్రాకుతున్నారు.

ఆ కంపార్టుమెంట్‌లో - కిటికీ పక్కన లాంగ్ సీట్లో కూర్చుని ఉన్నాడు ఒక యువకుడు. తన పక్క సీటులో రుమాలు వేసి ఉంచాడు అతడు. ఆ పక్కన మరో ముగ్గురు సర్దుకు కూర్చుని ఉన్నారు. అక్కడకు వచ్చిన వారంతా రుమాలు వేసి ఉన్న ఆ సీటుకై వాకబు చేస్తున్నారు. ఆ యువకుడు ఖాళీ లేదన్నట్టు సైగ చేస్తున్నాడు.

"ఎవరైనా వస్తారా?" ఒకతను అడిగాడు.

ఆ యువకుడు ఏ జవాబూ ఇవ్వలేదు.

కొద్దిసేపటి తర్వాత అటు వచ్చిన ఒక ముసలావిడ "కాస్త సర్దుకోవచ్చుకదా" అంది.

యువకుడు ఏమీ మాట్లాడలేదు. కిటికీ వైపు తల తిప్పేసాడు.



# చెప్పుదెబ్బ

మరికొంతసేపటి తర్వాత, ఒకతను అటు వచ్చాడు. "బాబూ కాస్త సర్దుకొని ఈ చిన్న పాపకు చోటివ్వు" అన్నాడు.

ఆ వ్యక్తి వైపు ఎగాదిగా చూసి తిరిగి కిటికీ వైపు తల తిప్పేసాడా యువకుడు.

"ఎవరైనా వస్తే లేస్తాను. సీటు ఇవ్వు" అంటూ ఒకతను ఆ రుమాలు తీయబోయాడు.

కస్సుమన్నాడు ఆ యువకుడు.

తమిళంలో మాట్లాడాడు. ససేమిరా సీటు ఇవ్వనంటున్నాడు. ఎవరో రావాలంటున్నాడు.

"తెలుగోడు కాదు. మనం చెప్పింది అతడికి అర్థంకాదు. వదిలేయండి" అన్నారు ఎవరో.

కిక్కిరిసిన జనం ఉండడంతో ఆ కంపార్టుమెంటులో గాలి ఆడడంలేదు. "రైలు కదిలితే బాగుణ్ణు. గాలైనా ఆడుతుంది" అనుకుంటున్నారు అంతా.

ఫ్లాట్‌ఫారం రద్దీతో గోలగోలగా ఉంది.

ప్రయాణీకులతో, వారిని సాగనంపేందుకు వచ్చిన వారితో, అమ్ముకునేవారితో, కూలీలతో గజిబిజిగా ఉంది అక్కడ వాతావరణం.

ఆ యువకుడు అంతటినీ కలియజూస్తున్నాడు. తన సొదలో తాను ఉన్నాడు. అతడు ఏమైనా అవకాశం ఇస్తాడేమోనని ఆ రుమాలు వేసిన సీటుని దక్కించుకోవాలని ఎంతో మంది ఆత్రంగా చూస్తూ నిల్చున్నారు.

కొద్దిసేపటి తర్వాత అక్కడకు వచ్చిన ఒక యువతి ఆ యువకుడుతో అంది "ఆ సీటు ఖాళీయేనా?"

ఆ యువకుడు ఆ యువతిని చూసాడు. చిన్నగా నవ్వేసి "ఖాళీయే" అన్నాడు ఆ రుమాలుని తీసేస్తూ.

ఆ యువతి గమ్మున ఆ సీట్లో కూర్చుండిపోయింది. చేతుల్లోని లగేజిని సీటు క్రిందకు నెట్టింది. 'హమ్మయ్య' అనుకుంది.

ఆ యువకుడు రుమాలుతో మొహం తుడుచుకున్నాడు. దువ్వెనతీసి తల దువ్వుకున్నాడు.

అక్కడ ఉన్నవారంతా అతడి చేష్టలకు నివ్వెరపోయారు.

"ఆరి భడవా... నీకు తెలుగు వచ్చా?" అనుకున్నారు కొందరు దీనంగా.

అంతలోనే ఒక ముసలాయన జోగుకుంటూ అక్కడకు రావడం, సీటుకై వెతుకులాడుతుండడం చూసిన ఆ యువతి లేచి ఆయనకు ఆ సీటు ఇచ్చింది.

ఆ ముసలాయన "చల్లగా ఉండమ్మా" అంటూ ఆ సీటులో కూర్చున్నాడు.

ఆ యువతి పక్కగా నిల్చొంది.

ఆ యువకుడు తేలు కుట్టిన దొంగలా తెల్ల ముఖం వేసాడు.

జనం ముసిముసినవ్వులు నవ్వుకున్నారు.

రైలు కదిలింది. ●

**బత్తుల వెంకట దుర్గా ప్రసాదరావు**